# రామాయణంలో పిడకలవేట

● చిట్టా దామోదరశాస్త్రి

శ్రీరామనవమి వస్తూందంటే తెలుగుదేశంలో బజార్లలో పందిళ్ళు వేస్తారు. ఆ నాటి మధ్యాహ్నం భద్రాచలంలో సీతారామ కళ్యాణం జరుగుతుంది.

ఆ ఉత్సవాలు రేడియోలో టీవీలో ప్రసారం అవుతాయి. అదికాదు విశేషం. తెలుగుదేశంలో ఎంతటి కుగ్రామంలో నైనా ఓ దేవాలయం ఉండకపోదు. అది రామాలయమైతే చెప్పక్కర్లేదు. కృష్ణాలయమైనా, విష్ణాలయమైనా అందులో సీతారామ కళ్యాణం జరుగుతుంది. విశేష మేమిటంటే వున్న ఒక్కగుడీ శివుడిదైనా రామనవమి నాడు పానకం, వడపప్పు పంచి పెడతారు. 'శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే...' అనడానికింత కంటె నిదర్శన మేం కావాలి?

ఆ సందర్భంగా రామకథ చెప్పకొనే ఆచారముంది. హరి కథలు, పురాణాలు, ఉపన్యాసాలు, నాటకాలు, తోలు బొమ్మలాటలు, జంగం కథలు- ఒకటేమిటి? ఆయా స్థలాలలో ఆ జనానికి రామ మహత్తు నేదో ఒక రూపంలో అందించడం పరిపాటి. ఆలాగున రామకథ వినే జానపదులకో చిక్కు వచ్చిపడింది. సీతను వెదికే కోతులకు చలి వేసిందని చెప్పాడు కథకుడు. శుద్ధ నవమినాటి చంద్రుడు కథలో ఆ ఘట్టం వేళకు అస్తమించాడు. అంతా చీకటిగా వుంది, కథకుడు వున్న కాస్త చోటు తప్ప. వెనుక కూర్చుండి కథ వింటున్న ఓ బుద్ధిమంతుడు పక్కవాడితో "చూడరా పాపం! రామ కార్యం కోసం వెళ్ళే ఆ కోతులకెంత కష్టం వచ్చిందో! కాస్త చలికాగి ముందుకు వెళ్తాయి. చలిమంట వేద్దాం పదండి" అన్నాడు.

సీతను వెదకడానికి కోతులు బైలుదేరినట్లు చలి మంట వేయడానికి భక్తులు బైలుదేరారు. కథ కాకుండానే జనం లేస్తున్నారని కథకుడు విచారించాడు. ఐనా కథ ఆపడానికి వీల్లేదు కదా! ముందుకు సాగిపోయాడు. హనుమంతుడు సముద్రం దాటాడు. లంకలో సీతను వెదికాడు. రావణుడు వచ్చి సీతతో "నన్ను వరించు" అని చెప్పాడు. సీతమ్మవారు గడ్డిపరక అడ్డం పెట్టి రావణుడితో మాట్లాడింది. హనుమ విన్నాడు. 'ఆహా! మహా పతివ్రత!' అని సంతోషించాడు. ఆ సందర్భంలో కథకుడు "కృతయుగంలో దమయంతి తన్ను కామించిన బోయను శపించి బూడిద చేసింది. త్రేతాయుగంలో సీత రావణుడికి హితోపదేశం చేసింది. పాపం! ద్వాపరాంతంలో ద్రౌపది కీచకుడితో ఇది ధర్మం కాదని బతిమాలింది. ఇట్లా యుగాలు మారగా పతివ్రతల వాగ్వైఖరి, శక్తి మారి పోయాయి" అని వ్యాఖ్యానించాడు.

ఆ కథ వింటున్న వారిలో భారతం బాగా చదివిన విమర్శకుడున్నాడు. ఆయనకు కర్ణుడంటే అభిమానం. ఆయన "ద్రౌపదేం పతివ్రత! ఐదుగురికి భార్య! ఆరో వాడు కర్ణుడు కావలసింది. కాదన్నాడు కాబట్టి కాస్తలో తప్పిపోయింది" అన్నాడు. అది విన్న ఆ కథకుడు చెవులు మూసుకొన్నాడు. "అంత మాటనకు బాబూ! ద్రౌపది యజ్ఞకుండంలో పుట్టింది. మహాపతివ్రత! నిండు సభలో దుశ్శాసనుడామె చీరలాగించాడు. దానికి ప్రధాన కారణం కర్ణుడు. వాడు 'ఒక్క స్త్రీకి ఒక్కడే మగడు. ఐదుగురు మగలున్న ఆడదాన్ని బట్టలూడదీసి సభలోకి తీసుకు వచ్చినా తప్పులేదన్నాడు. ఆ మాట పుచ్చుకొని దుర్యోధనుడామె బట్ట లూడదీయమన్నాడు.



దుశ్శాసనుడంతపనీ చేశాడు. అందుకే కృష్ణ భగవానుడు అర్జునునిచేత కర్ణుని చంపించాడు" అన్నాడు కథకుడు.

ఆ విమర్శక శ్రోత ఊరకొంటాడా? "మరి కృష్ణుడు హస్తినాపురానికి రాయబారానికి వెళ్ళి తిరిగి వస్తూ కర్ణునితో 'నీవు కన్యయైన కుంతికి సూర్యుని వరం వల్ల పుట్టావు. పాండవుల పక్షానికి మారిపో. మొత్తం రాజ్యం నీదే! ద్రౌపది నిన్నారవ భర్తగా స్వీకరిస్తుంది' అన్నాడే! పతివ్రతనుగురించి కృష్ణుడట్లా అనవచ్చా" అని ప్రశ్నించాడు. "కృష్ణుడన్నాడయ్యా! కర్ణుడు పార్టీ ఫిరాయించలేదుగదా! అట్లా కర్ణుని గొప్పతనం చాటాడు కృష్ణుడు" అంటూ కథకుడు సమర్థించాడు.

అంతలో కోతుల చలిమంట కోసం వెళ్ళిన వాళ్ళు "పిడకలు తెచ్చి చలిమంట వేశాం. కాస్సేపు కథాపి కోతుల్ని చలికాచుకోనివ్వండన్నారు. అందరూ విస్తుపోయారు. కర్ణుని సమర్థిస్తున్న పెద్దమనిషి "ఏమిటయ్యా! రామాయణం కథ చెప్తుంటే ఈ పిడకల వేట" అన్నాడు. అది విన్న ఓ వివేకి "పాపం! వాళ్ళు మూఢులు! అజ్ఞానులు! కథలోని కోతుల చలి బాధవిని ఊళ్ళోకి వెళ్ళి ఇంత చీకట్లో పిడకలు పోగుచేసి చలి మంట కోసం తెచ్చారు. ఇంత చదువుకొన్న నీవు ఈలాగున సందర్భ శుద్ధి లేని ప్రశ్నలడగడం వీరికంటె అజ్ఞానం కాదా ?" అన్నాడు.

ఆ విమర్శకుడు పెద్దమనిషి. స్వయంగా చదువుకొన్నాడేకాని గురు ముఖతః విన్నవాడు కాదు. దాంతో కొంత దోషం వచ్చింది. అతడు వెంటనే సర్దుకొని "నాదే పొరపాటు బాబూ! ఇంతమంది వింటున్న కథ మధ్యలో నేనీ ప్రశ్న వేసి వుండకూడదు" అని పశ్చాత్తాప పడ్డాడు. అంతలో కథకుడు పిడకల మంట వేసిన వాళ్ళతో సమయోచితంగా "మీరు పిడకల కోసం అట్లా వెళ్ళారు, హనుమ సముద్రం దాటి లంకకు వెళ్ళాడు. మిగిలిన కోతులు వచ్చి చలికాచుకొంటు న్నాయి" అన్నాడు. ఆ వేళకు కథ వినే పిల్లలు పోయి చలి కాచుకొంటూ మధ్య మధ్య కోతి చేష్టలు చేస్తు న్నారు. కథకుడీలోగా సముద్రానికి వారధి కట్టించాడు. రావణవధ జరిపించాడు. అయోధ్యలో పట్టాభిషేకం ఐందనిపించాడు. "నీ నామ రూపములకు నిత్య జయ మంగళం..." అంటూ కథ చాలించాడు.

జనం ఇంటి ముఖం పట్టారు. ఆ విమర్శకునితో ఆ వివేకి "నిజంగా నేడు సుదినం! ప్రశ్న వేస్తే వేశావ్; పశ్చాత్తాపపడ్డావ్!" అన్నాడు. అప్పుడా విమర్శకుడు "కౌరవ సభలో దుర్యోధనుని ప్రీతికోసం ఆలాగున ప్రవర్తించిన కర్ణుడు కృష్ణుని దగ్గర పశ్చాత్తాప పడ్డాడుగా! వాని పాపం నిష్కృతి ఐనట్లేనా?" అన్నాడు. "నిజమే! నిష్కృతి కావాల్సిందే! కాని కౌరవ సభలో ద్రౌపదిని 'గౌః గౌః' అని ఎగతాళి చేశాడే కర్ణుడు!" సాగలాగాడు వివేకి. "అంటే?" అన్నాడు శ్రోత. "గౌః అంటే సంస్కృతంలో ఆవు లేక ఆబోతు అని అర్థం. ఒక్క ఆవు వెంట ఒక్క ఆబోతే పడాలని లేదుగద! అట్లాగే ద్రౌపది విషయమూ అన్నాడు కర్ణుడు. తరువాత కృష్ణుడు తన జన్మ రహస్యం చెప్పినప్పుడు యుద్ధం తప్పక జరుగుతుందనీ, దుర్యోధనాదులంతా చస్తారనీ, తానూ వారితో పాటే అనీ, ధర్మరాజే రాజ్యమేల్తాడనీ అన్నాడు కర్ణుడు. మిగిలిన ఏ పాపం కంటె పతివ్రతల గురించి నీచంగా మాట్లాడటం మహాపాపం. ఓ ఇల్లాలి నంటి హోయుగము క్రుంగితి హో! అని చెప్పేవారు మా గురువుగారు" అంటూ ముగించాడు వివేకి.

తల్లడిల్లిపోయినాడు కర్ణుని అభిమాని.

అట్లా పుట్టింది రామాయణంలో పిడకల వేట!